కేసీఆర్ వైపే రాష్ట్ర ప్రజలు

- బీఆర్ఎస్ రజతోత్సవం అంటే పండుగ రోజే
- బీఆర్ఎస్ అంటే తెలంగాణకు ప్రత్యామ్నాయం
- కేసీఆర్ మాట వినేందుకు తరలివస్తున్న ప్రజలు
- ఎల్కతుర్తిలో మీడియాతో మాజీ మంత్రి హరీశ్‌రావు
- బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల పరిశీలన

బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

వరంగల్, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇప్పుడు రాష్ట్రంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ప్రజలంతా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వైపే చూస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 'తెలంగాణ ఆత్మగౌరవ బావుటాను ఎగరేసిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టంచేశారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం కష్టపడి పనిచేశామని చెప్పారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలోని బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను హరీశ్‌రావు శనివారం పరిశీలించారు. అనంతరం అక్కడి మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. రజతోత్సవ మహాసభ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా తరలి వస్తున్నారని తెలిపారు. కేసీఆర్‌ను చూడాలని, ప్రసంగం వినాలని ఎడ్లబండ్లు, వాహనాలు, సైకిళ్లపై తరలివస్తున్నారని, ఎందరో పాదయాత్రగా కూడా సభకు వస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రస్థానంలో ఉద్యమ సమయంలో, సొంత రాష్ట్రంలో అతిపెద్ద సభలకు వరంగల్ వేదిక అయ్యిందని, ఇప్పుడు రజతోత్సవాన్ని ఇక్కడే నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు. ఎల్కతుర్తి, హుస్నాబాద్ ప్రాంతాలు సమైక్య పాలనలో కరువు కాటకాలకు నిలయంగా ఉండేవని, కేసీఆర్ హయాంలో ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేశారని తెలిపారు. ఏడాదిన్నర కాలంలో పాలు, నీళ్ల తేడా తెలిసిందని, మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కొత్త పథకాలు లేవని, బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలు బంద్ అయినయని విమర్శించారు. సాగునీళ్లే కాదు తాగునీళ్లను కూడా ఈ కాంగ్రెస్ సర్కార్ ఇవ్వలేకపోతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమ్మక్క సాగర్ కడితే, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహణ బిల్లులు ఇవ్వలేక పంటలను ఎండబెట్టిందని మండిపడ్డారు. కృష్ణానదిలో తాత్కాలిక ఒప్పందం ప్రకారం మనకు 34శాతం వాటా ఉన్నదని, 27శాతం నీళ్లు కూడా ఈ దద్దమ్మ ప్రభుత్వం వాడుకోలేకపోయిందని ధ్వజమెత్తారు.

> తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చింది, వచ్చిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది, తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే. బీఆర్ఎస్ రజతోత్సవం తెలంగాణ ప్రజలకు ఒక పండుగ రోజు.
>
> - హరీశ్‌రావు

సభకు అంచనాలకు మించిన జనం

బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా అంచనాలకు మించిన జనం వస్తారని తమకు సమాచారం ఉన్నదని హరీశ్‌రావు వివరించారు. ఎవరికి వాళ్లుగా స్వచ్ఛందంగా వస్తున్నారి చెప్పారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారో వినాలనే ఉత్సాహం కాంగ్రెస్ నాయకులకే ఎక్కువగా ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పునరుద్ఘాటించారు.

> కేసీఆర్‌తోనే తెలంగాణ సాధ్యమైతదని నమ్మిన జయశంకర్ సార్‌ది వరంగల్. వరంగల్ ప్రజలు ఎప్పుడూ బీఆర్ఎస్‌కు అండగా ఉన్నారు. రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాల నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిర్వహిస్తున్న సభ ఇది. సభ విజయవంతంగా జరిగేందుకు అందరూ ఆశీర్వదించాలని కోరుతున్నాం.
>
> - హరీశ్‌రావు

సమస్యలు సృష్టించేందుకు కుయుక్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ట్రాఫిక్ సమస్యను సృష్టించి, సభకు అంతరాయం కలిగించే ప్రయత్నం చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. మరోసారి మన ప్రభుత్వం రావాలి, కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రతిన పూనుదాం' అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఒడితెల సతీశ్‌కుమార్, గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, దేవీప్రసాద్, కే వాసుదేవారెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, వై సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన శకానికి నాంది

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ఎల్కతుర్తిలో ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ నూతన శకానికి నాంది పలుకనున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని పార్టీశ్రేణులు దండులా కదిలిరావాలని పిలుపునిచ్చారు.

చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభ

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లిలో శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభకు జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి లక్ష మంది వరకు హాజరు కానున్నారని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గం నుంచే 10 వేల మంది వరకు తరలుతున్నట్టు వివరించారు.

కేసీఆర్ మాట వింటే గుండె ధైర్యం వస్తది

- నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ మాట వింటే గుండె ధైర్యం వస్తదని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎల్కతుర్తి వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ స్థాపించిన గులాబీ పార్టీ 25 ఏండ్లుగా ప్రజలకు గుండె ధైర్యాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు.

బీఆర్ఎస్ పోస్టర్లు చించివేత

రజతోత్సవ సభపై కాంగ్రెస్, బీజేపీ కుట్రలు

- పెహల్గాం దాడి నేపథ్యంలో వాయిదా పడ్డదంటూ దుష్ప్రచారం
- సభకు వెళ్లకుండా అడ్డుకొనేందుకు పన్నాగం

పటాన్‌చెరులో బస్టాండ్ సమీపంలో చింపివేసిన బీఆర్ఎస్ ఫ్లెక్సీలు

పటాన్‌చెరు/ కేపీహెచ్‌బీ కాలనీ/హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభ బ్రహ్మాండంగా జరగనున్నదని వార్తలు వస్తుండడంతో కాంగ్రెస్, బీజేపీ బెంబేలెత్తుతున్నాయి. సభ సక్సెస్ అయితే ఉనికి కోల్పోతామనే భయంతో చీకట్లో చేతులు కలిపి కుట్రలకు తెరలేపాయి. పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సభ వాయిదా పడ్డదని సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారానికి దిగాయి. తప్పుడు పోస్టులు సృష్టించి వాట్సాప్, ఫేసుబుక్, ఇన్‌స్టాగ్రాంలో షేర్ చేస్తున్నాయి. కొన్నిచోట్ల పోస్టర్లను చించివేసి, ఫ్లెక్సీలను తొలగించారు. రజతోత్సవ సభ వాయిదా పడ్డదంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ జెండా చూస్తే కాంగ్రెస్ నేతలకు వణుకు పుడుతుందని, అందుకే మహాసభ ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించేందుకు అధికారులను పావులుగా వాడుతున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన 'చలో వరంగల్' ఫ్లెక్సీలను అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది తొలిగించారని బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి మండిపడ్డారు.

కాంగ్రెస్ సర్కార్‌పై దండయాత్ర

- కసిగా బీఆర్ఎస్ సభకు లక్షలాదిగా జనం: శ్రీనివాసగౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభ.. కాంగ్రెస్‌పై దండయాత్రగానే తెలంగాణ ప్రజలు భావించారు. అందుకే సభకు అంచనాకు మించి స్వచ్ఛందంగా లక్షలాదిగా జనం తరలివస్తున్నారు.. అని మాజీ మంత్రి వీ శ్రీనివాసగౌడ్ తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ సభతో కేసీఆర్‌పై ప్రజల్లో ఆశలు చిగురించాయని స్పష్టంచేశారు. రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంపై ప్రజల్లో ఆసక్తి నెలకొన్నదని తెలిపారు. సభకు తరలి వచ్చే ప్రతి వాహనంపై తప్పకుండా కేసీఆర్ బొమ్మ ఉన్న స్టిక్కర్‌ను అతికించాలని, బీఆర్ఎస్ జెండా కట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు కురువ విజయ్‌కుమార్, అభిలాశ్ రంగినేని, తుంగబాలు, మహిపాల్, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభ ప్రభంజనం కావాలి: లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఒక ప్రభంజనం కావాలని మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలోని 27 వార్డులు, మండలంలోని గంగాపూర్‌లో గులాబీ జెండాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

రజతోత్సవ సభకు దండులా కదలాలి: గువ్వల

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 26: రజతోత్సవ సభకు అచ్చంపేట నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు దండు లా తరలివెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో మీడియాతో మాట్లాడారు.

బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం: కోలేటి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే రజతోత్సవ సభతో బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం దక్కుతుందని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ శనివారం ప్రకటనలో ధీమా వ్యక్తంచేశారు. గులాబీ దళపతి కేసీఆర్ సారథ్యంలో మరో విజయ ప్రస్థానానికి పార్టీ సిద్ధమవుతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త గుండెనిండా ఆశలు చిగురించాయన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన బీఆర్ఎస్.. బంగారు తెలంగాణ బాట నిండా గులాబీలు పరుస్తున్నదన్నారు.

75 ఏండ్లు.. 75 కిలోమీటర్లు పాదయాత్ర

ఆ రైతు వయసు 75 ఏండ్లు కన్న కొడుకు చనిపోయినప్పుడు కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బీమా ఆదుకుంది. దీంతో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం చంద్రుతండాకు చెందిన రైతు భూక్యా గంగ్యానాయక్ గుండె నిండా కేసీఆర్‌పై కృతజ్ఞత నింపుకొని కాలినడకన(75 కిలోమీటర్లు) ఎల్కతుర్తిలోని బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బయలుదేరాడు. శనివారం వరంగల్ జిల్లా నెక్కొండలో బీఆర్ఎస్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. - నెక్కొండ

కాలగర్భంలోకి ఎస్ఎల్‌బీసీ సొరంగం..!

నల్లగొండ చిరకాల స్వప్నాన్ని చిదిమేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

అధ్యయనం లేని హడావుడితో కుప్పకూలిన సొరంగం పైకప్పు

ముందుకు వెళ్లలేని పరిస్థితుల్లో సహాయ చర్యల నిలిపివేత

కనీసం శవాలను బయటికి తీయలేని నిస్సహాయస్థితిలో రేవంత్ సర్కార్

- షియర్ జోన్‌ను ముట్టుకునే పరిస్థితిలేదని తేల్చిన నిపుణుల కమిటీ
- పాత అలైన్‌మెంట్‌కు అనుగుణంగా సొరంగమార్గం అసాధ్యమే
- ఎస్సెల్బీసీని పక్కనబెట్టి ఏఎంఆర్ ప్రాజెక్టుపై అంతర్గతంగా కసరత్తు
- విషయం బయటికి పొక్కకుండా జలమండలి భుజంపై ఐదో మోటారు అంశం
- సుంకిశాల ఉండగా ఐదో మోటారు మాకెందుకంటున్న జలమండలివర్గాలు

(గుండాల కృష్ణ-మ్యాకం రవికుమార్)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఫ్లోరైడ్‌పీడిత నల్లగొండ జిల్లా చిరకాల స్వప్నం శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ(ఎస్ఎల్‌బీసీ) కాలగర్భంలో కలిసిపోయినట్టేనా? మనుషుల సంచారంపైనే నిషేధమున్న టైగర్ రిజర్వు ఫారెస్టులో భారీ యంత్రాలతో డ్రిల్లింగ్‌చేస్తే తప్ప సొరంగం ఇప్పుడున్న దశను మార్చుకొని ముందుకు పోయే పరిస్థితి లేనట్టేనా? టీబీఎం చిక్కుముడిలో ఇన్నాళ్లూ మూడడుగులు ముందుకు... ఆరడుగులు వెనక్కి అన్నట్టుగా సాగిన సొరంగం పనులకు శాశ్వతంగా బ్రేక్ పడినట్టేనా? నిపుణుల కమిటీతో పాటు ప్రభుత్వవర్గాల నుంచి అంతర్గతంగా వినిపిస్తున్న విశ్వసనీయ సమాచారం మేరకు వీటికి అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. రెండు నెలలకు పైగా రేయింబవళ్లు శ్రమించిన రెస్క్యూ బృందాలు చివరి 40-50 మీటర్లలోకి వెళ్తే రిస్కులో తప్పదనే నిపుణుల హెచ్చరిక తర్వాతే ప్రభుత్వం మూడు నెలల విరామం ఇచ్చినట్టుగా తెలుస్తున్నది. ఎలాగూ నెలన్నర రోజుల్లో వర్షాకాలమే మొదలవుతున్నందున సహాయ చర్యల పునరుద్ధరణ అనేది అసాధ్యం. దీంతో ప్రభుత్వ పెద్దలు సొరంగానికి ప్రత్యామ్నాయంగా ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు సామర్థ్య పెంపుపై దృష్టిసారించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని నేరుగా చెప్పకుండా.. హైదరాబాద్ నగర నీటిసరఫరా పేరిట జలమండలి భుజంపై ఐదో మోటారు ప్రతిపాదనను పెట్టి అదనపు ఆయకట్టుకు సాగునీరిచ్చే ఏర్పాట్లు గుట్టుగా సాగుతున్నట్టు సమాచారం. మాధవరెడ్డి ప్రాజెక్టులోని కాల్వల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచే పనులకు ఇప్పటికే అంచనాలు సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. తద్వారా ఎస్ఎస్‌బీసీ ప్రాజెక్టు లక్ష్యం మేరకు మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారానే సాగునీరు ఇచ్చి కాలగమనంలో 'సొరంగం'ను చెరిపివేసేలా పావులు కదుపుతున్నట్టు స్పష్టమవుతున్నది. శ్రీశైలం సొరంగం ప్రాజెక్టు పేరుతో ఇప్పటివరకు ఖర్చు చేసిన దాదాపు రూ.3-4వేల కోట్లు వృథా అయినట్టే.

మరో టెక్నికల్ సబ్ కమిటీ

> పర్యావరణ మంత్రిత్వశాఖ విధించిన షరతుల మేరకు అధ్యయనం చేసి పనుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సిఫార్సులను చేసేందుకు సాంకేతిక నిపుణులతో మరో ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. సొరంగ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలో సైట్-నిర్దిష్ట నివేదికను సమర్పించే బాధ్యతను ఉపకమిటీని అప్పగించింది.

> ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిలిపివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే. ఆరుగురు కార్మికుల మృత దేహాలను బయటకు తీయకుండానే మూడు నెలలు సహాయక చర్యలు నిలిపివేయడం అత్యంత దుర్మార్గం.
>
> - మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఎస్ఎల్‌బీసీ మొదలైందిలా!

నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతాలకు తాగు, సాగునీరు ఇచ్చేందుకు గ్రావిటీ ప్రాతిపదికన రూపుదిద్దుకున్నదే శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ(ఎస్ఎస్‌బీసీ)ప్రాజెక్టు. ఐదున్నర దశాబ్దాలకుపైగా నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో సాగునీటి రంగంలో పట్టిన తరాజులో తెలంగాణ కోటా కింద మొగ్గు కోసం పురుడు పోసుకుంది. నిధులియ్యాలే గానీ...నీళ్లు కాదు! అనే సమైక్య సూత్రంలో భాగంగా 'టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)' అనే విషవలయంలో పెట్టి ఎస్ఎల్‌బీసీ పనులను మొదలుపెట్టారు. ముందుకు పోదు... వెనక్కి రాదు అన్నట్టుగా సాగిన సొరంగం పనుల్లో అత్యంత కీలకమైన ఎనిమిది మీటర్ల షియర్‌జోన్‌లో ఆచితూచి అడుగులు వేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొంచెం కూడా అధ్యయనం లేకుండానే పనులు మొదలుపెట్టింది. వాస్తవానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 11 కిలోమీటర్ల సొరంగ నిర్మాణం, 7.5 టీఎంసీల నిల్వతో రిజర్వాయర్, రెండోదశ సొరంగ నిర్మాణం, ఓపెన్ కాల్వల పనులు పూర్తయ్యాయి. శ్రీశైలం నుంచి మొదలైన ఈ ఇన్‌లెట్ సొరంగంలో ఎనిమిది మీటర్ల షియర్‌జోన్‌ను గుర్తించడంతో పనులు నిలిచిపోయాయి. పకడ్బందీ అధ్యయనం, జాగ్రత్తలతో ముందుకుపోవాలని నిర్ణయించారు. ఆలోపు అవుట్‌లెట్ నుంచి పనులు కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నా...టీబీఎం బేరింగ్ లేదంటూ నిర్మాణ సంస్థ మొండికేయటం,ఎన్నికలు రావడం... ఆపై కాంగ్రెస్ అధికారంలోకి రావటం జరిగింది. వచ్చీరాగానే కాంగ్రెస్ పాలకులు ఇన్‌లెట్... అవుట్‌లెట్ పనులు చేసి ఏడాదిన్నరలో సొరంగంలో కృష్ణాజలాలను పరుగులు పెట్టిస్తామని ప్రకటనలు చేశారు. కానీ నిర్మాణ సంస్థ టీబీఎం బేరింగ్ లేదంటూ అవుట్‌లెట్ పనుల్ని మొదలుపెట్టలేదు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో హడావిడిగా ఇన్‌లెట్ పనులు మొదలుపెట్టి జాగ్రత్తలు లేకుండానే షియర్ జోన్‌లోనూ సొరంగాన్ని తవ్వింది. దీంతో అది ఒక్కసారిగా కుప్పకూలి...ఎనిమిది మంది కార్మికులు మృత్యువాతపడ్డారు.

63 రోజులు సాగిన సహాయ చర్యలు

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ టన్నెల్‌లో ఫిబ్రవరి 22న 13.93 కి.మీ వద్ద షియర్‌జోన్ (పర్రెలు వారి వదులైన రాతిపొరలు) వద్ద పైకప్పు కూలిపోయింది. ఇప్పటికీ 63 రోజులు పూర్తయింది. ఈ ప్రమాదంలో 8 మంది చిక్కుకుపోయారు. ఇద్దరి మృతదేహాలను వెలికితీయగా, ఆరుగురి అచూకీ అంతుచిక్కలేదు. కార్మికుల జాడను కనుగొనడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆర్మీ, నేవీ, ర్యాట్ మైనర్లు, రోబో వినియోగం సహాయ చర్యల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి, టెక్నికల్ కమిటీ.. ఇలా అనేక ప్రకటనలతో కాలయాపన తప్ప పురోగతి లేదు. ప్రమాద ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటించి రెస్క్యూ ఆపరేషన్‌కు తెరదించింది. కంటితుడుపుగా సహాయ చర్యలను కొనసాగిస్తున్నామని చెప్తున్నా, రెస్క్యూ బృందాలు తరలిపోతుండడం గమనార్హం.

ఇక ముందుకెళ్లడం అసాధ్యమే!

అధ్యయనం చేయకుండా ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలను కొనసాగించడం కష్టమేనని సర్కారు ఏర్పాటుచేసిన టెక్నికల్ కమిటీ నిర్ణయించింది. అచూకీ లభించని ఆరుగురు కార్మికులు మృతిచెందారని అధికారికంగా ప్రకటించడంతోపాటు, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. తదుపరి కార్యాచరణపై అధ్యయనం కోసం నిపుణులతో మరో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. భవిష్యత్‌లోనూ సొరం గం పనులను టీబీఎం ద్వారా చేపట్టడం కష్టమేనని, కేవలం డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ (డీబీఎం) మెథడ్ ఒక్కటే శరణ్యమని కమిటీ తెలిపింది. శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ పథకం పూర్తయినా కొత్తగా సాగులోకి వచ్చే ఆయకట్టు తక్కువ మోతాదులోనే ఉంటుంది. కానీ ఇప్పు డు సొరంగం పూర్తయ్యే పరిస్థితి లేనందున అదనంగా లక్ష ఎకరాలకు సాగునీటిని ఎలా సమకూర్చాలనే దానిపై ప్రభుత్వం అంతర్గం గా తీవ్ర కసరత్తు చేస్తున్నది. మాధవరెడ్డి ప్రాజె క్టు సామర్థ్యాన్ని పెంపు, విస్తరణతో ఎస్సెల్బీసీ లక్ష్యం మేరకు ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని ప్రణాళిక రూపొందిస్తున్నారు.

మేడిగడ్డ బరాజ్‌కు ఓ నీతి.. ఎస్ఎల్‌బీసీకి ఓ రీతి

మేడిగడ్డ బరాజ్‌లో 7వ బ్లాక్‌లో ఒక పిల్లర్ కుంగుబాటుకు గురైంది. డిజైన్ లోపాలు, అధ్యయనాలు చేయలేదంటూ కాంగ్రెస్ నానాయాగీ చేసింది. ప్రాజెక్టు నిరర్థకమని ముద్ర వేస్తున్నది. సాంకేతిక కారణాలను చూపుతూ పునరుద్ధరణ పనులను చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. అదే కాంగ్రెస్ హయాంలో ప్రారంభమై, నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించినా కూడా ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని విపత్తుగా సమర్థించుకున్నది. నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా పనులను పునః ప్రారంభించింది. వెరసి భారీ సీపేజీ రావడంతోపాటు, అంచనాలు తప్పి సొరంగం కుప్పకూలింది. ఇప్పుడు ఏకంగా ప్రాజెక్టునే పక్కపెట్టాల్సిన దుస్థితిని తీసుకొచ్చింది.

గుట్టుగా సాగుతున్న ప్రత్యామ్నాయం

మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్ల ద్వారా నీటిని లిఫ్టు చేయకుండా శాశ్వత పరిష్కారంగా గ్రావిటీ మీద సాగునీరు అందించేందుకే ఎస్సెల్బీసీ ప్రాజెక్టును రూపొందించారు. శ్రీశైలం నుంచి సొరంగం ద్వారా తరలించే కృష్ణాజలాలను చివరకు మాధవరెడ్డి ప్రాజెక్టులోని ప్రధాన కాల్వకు అనుసంధానిస్తారు. తద్వారా మాధవరెడ్డి ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుతో పాటు దిగువన ఉదయ సముద్రం ప్రాజెక్టుకు నీరు అంది లక్ష ఎకరాలకు జీవం వస్తుంది. అందుకే ఎస్ఎల్‌బీసీకి ప్రత్యామ్నాయంగా గుట్టుగా కసరత్తు చేపడుతున్నది.

- ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం నుంచి నేరుగా 4,000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వస్తాయి. తద్వారా సులువుగా నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.
- ప్రస్తుతం మాధవరెడ్డి ప్రాజెక్టులోని 4 మోటర్ల ద్వారా 2400 క్యూసెక్కులు (4600) విడుదల అవుతున్నాయి. దాదాపు 350 క్యూసెక్కుల వరకు హైదరాబాద్ తాగునీటి కోసం మళ్లిస్తున్నారు. మిగిలిన జలాలు మూడున్నర లక్షల ఆయకట్టు కోసం వినియోగిస్తున్నారు.
- ఎస్ఎల్‌బీసీ పూర్తయ్యే పరిస్థితి లేనందున మాధవరెడ్డి ప్రాజెక్టులోనే ఐదో మోటారును ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. దీని ద్వారా మాధవరెడ్డి ప్రాజెక్టులోనే అదనంగా 600 క్యూసెక్కులు తోడై మూడు వేల క్యూసెక్కులు అందుబాటులోకి వస్తాయి.
- హైదరాబాద్ తాగునీటి కోసం ఇప్పుడు మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి 350 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సుంకిశాల పథకం పూర్తయితే నాగార్జునసాగర్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తాగునీటిని తీసుకోవచ్చు. దీంతో మాధవరెడ్డి ప్రాజెక్టుపై ఆ భారం తగ్గుతుంది.
- ఐదో మోటరు ద్వారా వచ్చే అదనపు 600 క్యూసెక్కులతోపాటు హైదరాబాద్ తాగునీటి రూపంలో మిగిలే 350 క్యూసెక్కులు.. ఇలా వెయ్యిక్యూసెక్కులు అదనంగా వస్తాయి. ఈ నీటిని ఉదయ సముద్రం లిఫ్ట్ కింద ఉన్న ఆయకట్టుకు సర్దుబాటు చేస్తే అదనంగా లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.
- అంటే ఎస్సెల్బీసీ ద్వారా అందే నీటిని మాధవరెడ్డి ప్రాజెక్టుతోనే సర్దుబాటు చేయొచ్చన్న మాట.
- ఒకవైపు జలమండలి తమకు సుంకిశాల పథకం ఉన్నందున ఐదో మోటరు అవసరం లేదన్నా... నీటిపారుదల శాఖ ఐదో మోటారుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.